
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
5
మంగళవారం 31 డిసెంబరు 2024
జిల్లాల వార్తలు



## ఖనిజాల అన్వేషణపై 3 నుంచి ఐఐటీహెచ్‌లో సదస్సు

కంది, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా కీలకమైన ఖనిజాల అన్వేషణ, అభివృద్ధి కోసం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో వచ్చే నెల 3, 4 తేదీల్లో ఆస్ట్రేలియా భూగర్భ శాస్త్రవేత్తలతో సదస్సు నిర్వహిస్తున్నామని ఐఐటీహెచ్ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియా-ఇండియా క్రిటికల్ మినరల్స్ హబ్ పేరుతో ఈ సదస్సు జరగనున్నది. ఖనిజాల పరిశోధనలో సవాళ్లను పరిష్కరించేందుకు శాస్త్రవేత్తలను ప్రోత్సహించడమే సదస్సు లక్ష్యమని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు.

# మార్మోగిన రుద్రనామస్మరణ

**కొమురవెల్లి మల్లన్నకు కనులపండువగా లక్ష బిల్వార్చన**

- భక్తిప్రపత్తులతో ఏకాదశ రుద్రాభిషేకం
- కొనసాగుతున్న భక్తుల రద్దీ
- బుకింగ్ ఆదాయం రూ.16.50 లక్షలు
- వైభవంగా రథోత్సవం



బిల్వాలతో మల్లికార్జునస్వామి

చేర్యాల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం రుద్రనామస్మరణతో మారుమోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మల్లన్నకు అత్యంత వైభవంగా లక్ష బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవరుత్విక్‌లు స్వామివారికి శాస్త్రోక్తయుక్తంగా బిల్వార్చన జరిపారు. అత్యంత భక్తిప్రపత్తులతో ఏకాదశ రుద్రాభిషేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజున మల్లన్నకు సుప్రభాత సేవ, గణపతి పూజ, శివపుణ్యాహవాచనం, నాందిసమారాధన, గురుపంచకలశస్థాపన, నవగ్రహ ఏకాదశరుద్ర సప్తమాతృకా త్రిమూర్తి, త్రిమాత, అష్టదిక్పాలక నిత్యార్చన, ప్రధాన కలశస్థాపన, ఆవాహన అర్చనతో పాటు లక్ష బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం పూజలు జరిపారు. వీరశైవాగమ వేదపాఠశాల విద్యార్థులు మల్లన్నను స్తుతిస్తూ చేసిన మంత్రోచ్చారణలతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. మల్లన్నను దర్శించుకునే భక్తుల రద్దీ కొనసాగుతుంది.

### ఘనంగా రథయాత్ర

కల్యాణం అనంతరం సాంప్రదాయబద్ధంగా గతంలో ఎడ్లబండ్లతో శకటోత్సవం జరిపేవారు. కొన్నాళ్లుగా టేకురథంలో ఉత్సవ దేవతామూర్తులను నెలకొల్పిఆలయ పరిసరాల గుండా శోభాయాత్ర నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం రాత్రి రథయాత్రను

మిగతా 7వ పేజీలో...



ఉత్సవమూర్తులతో స్వామివారి రథయాత్రలో భక్తుల కోలాహలం



పటాన్‌చెరులో నేషనల్‌హైవే పనులను పరిశీలిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ (ఫైల్)





నర్సాపూర్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ (ఫైల్)

# 2024 యాదిలో..

2024 రౌండప్ ఆత్మావలోకనం

## ఉమ్మడి జిల్లాకు చిరస్మరణీయం

- లోక్‌సభ ఎన్నికలో రాజకీయం తారుమారు
- మోదీ, రాహుల్, అమిత్‌షా, రేవంత్, కేసీఆర్ పర్యటనలు
- మెదక్‌లో బీజేపీ, జహీరాబాద్‌లో కాంగ్రెస్
- పార్టీ మారిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య దుర్మరణం
- పదవులన్నీ సంగారెడ్డికే..సిద్దిపేట, మెదక్‌కు నిల్
- 'సేంద్రియ' సాగుకు ఉపరాష్ట్రపతి, గవర్నర్ బాసట
- శతాబ్ది వేడుకలతో మురిసిన మెదక్ చర్చి
- వణుకు పుట్టించిన 'హైడ్రా'

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, డిసెంబరు 30 : మెతుకుసీమగా పేరొందిన ఉమ్మడి మెదక్ జిల్లా చరిత్రలో 2024 సంవత్సరం చిరస్మరణీయంగా నిలవనున్నది. ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్య, వైద్య, వ్యవసాయ, ఆధ్యాత్మిక, సాంకేతిక రంగాలలో ఒడిదుడుకులు, పరిణామాలు అనేకం చోటుచేసుకోవడమే ఇందుకు కారణం. ఎత్తుపల్లాలతోపాటు సంచలనాలు, రికార్డులు, సంబరాలు, విషాదాలూ ఉన్నాయి. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయం తారుమారైంది. బీఆర్ఎస్ పార్టీకి పుట్టినిగడ్డగా భావించే ఈ ప్రాంతంలో ఎదురుగాలి వీచింది. జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి అగ్రనేతలంతా తమ ప్రచారం ద్వారా హోరెత్తించడంతో విభిన్న ఫలితాలొచ్చాయి. పటాన్‌చెరులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఉన్న లాస్య నందిత పటాన్‌చెరు సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో చనిపోయారు. ఇక సేంద్రీయ పంటలు పండించే

మిగతా 7వ పేజీలో...



ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)



ఎన్నికల ప్రచారంలో మాజీ సీఎం కేసీఆర్ (ఫైల్)

---

'ప్రజావాణి'కి
## ఫిర్యాదుల వెల్లువ

- సంగారెడ్డిలో కలెక్టర్, మెదక్‌లో అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో అర్జీల స్వీకరణ

8

24వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా
## ఉద్యోగుల సమ్మె

- క్రమబద్ధీకరించే వరకూ సమ్మె కొనసాగిస్తాం : సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

8

వేతన బకాయిలు చెల్లించాలని
## పంచాయతీ కార్మికుల ఆందోళన

---

## దిగ్వాల్‌లో బ్యాంకు దోపిడీకి యత్నం

- గునపంతో తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగుడు
- అలారం మోగుడంతో అప్రమత్తమైన గురుకుల పాఠశాల వాచ్‌మన్
- బయటి నుంచి గొళ్లెం పెట్టి పోలీసులకు సమాచారం

6





---

# రూ.38 కోట్ల 'మందు చూపు'

### న్యూ ఇయర్ వేడుకలకు మూడురోజుల ముందే మద్యం డంపింగ్
### సాధారణ రోజులతో పోలిస్తే మూడు రెట్లు డిమాండ్



మెదక్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం వేడుకలకు ముందస్తుగా వైన్స్‌షాపుల నిర్వాహకులు ఐఎంఎల్ డిపో నుంచి భారీగా మద్యాన్ని కొనుగోలు చేశారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ స్టాక్ పంపిణీ చేసుందుకు ఐఎంఎల్ డిపోను తెరిచి ఉంచారు. కొల్చారం మండలం చిన్నఘణపూర్‌లోని ఐఎంఎల్ డిపో నుంచి మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 134 మద్యం దుకాణాల కోసం శని, ఆది, సోమవారాల్లో రూ.38 కోట్ల మద్యాన్ని తీసుకువెళ్లారు. న్యూఇయర్ వేడుకల్లో మద్యం అమ్మకాలపై ప్రతీ ఎక్సైజ్ డివిజన్‌కూ టార్గెట్లు ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఇందు కోసం నిబంధనలను సైతం సడలించినట్లు తెలుస్తోంది. సాధారణ రోజుల్లో రోజుకు మూడు, నాలుగు కోట్ల రూపాయల మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకుని రోజుకు రూ.12 కోట్ల మద్యాన్ని ఐఎంఎల్ డిపో నుంచి షాపుల నిర్వాహకులు తరలించారు. ఐఎంఎల్ డిపో అధికార వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం సోమవారం మధ్యాహ్నం వరకు మెదక్, సంగారెడ్డి డివిజన్ల పరిధిలో లిక్కర్ 9,779 కేసులు, 15,594 బీరు కేసులు డంప్ అయ్యాయి. మరోవైపు న్యూఇయర్ వేడుకలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని పోలీసులు యువతను హెచ్చరిస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు చేపట్టడానికి వెనకాడేది లేదని సూచిస్తున్నారు.

---



ప్రయోగాలు చేస్తున్న ఇంటర్ విద్యార్థులు (ఫైల్)

# నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

- ల్యాబ్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు
- మరమ్మతులు, సైన్స్ పరికరాల కొనుగోలుకు నిధులు
- నేరుగా కాలేజీల బ్యాంకు ఖాతాలో జమ
- మెదక్ జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలు

మెదక్ అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అవసరమైన రసాయనాలు, సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే కాలేజీ ప్రిన్సిపాళ్ల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమయ్యాయి. మెదక్ జిల్లావ్యాప్తంగా 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలున్నాయి. ఇంటర్ రెండో సంవత్సరంలో మాత్రమే ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తారు. చాలా కాలేజీల్లో ల్యాబ్‌లు అధ్వానంగా ఉండడంతో పాత పరికరాలతోనే ప్రయోగాలు చేస్తున్నారు. అవసరమైన రసాయనాలు లేకపోవడంతో ప్రయోగాలు అంతంత మాత్రంగానే మారాయి.

### ల్యాబ్‌ల ఆధునీకరణకు రూ.25 వేలు

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం 6,928 మంది, ద్వితీయ సంవత్సరం 6,473 మంది చదువుతున్నారు. విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు ప్రతీ కళాశాలకు రూ.25 వేల చొప్పున నిధులను డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ బోర్డు ఎడ్యుకేషన్ విడుదల చేసింది. ఏడేళ్ల తర్వాత కాలేజీలకు సర్కారు నిధులు మంజూరు చేసింది. ప్రతీ కాలేజీకి రూ.4 లక్షల చొప్పున విడుదల చేయడంతో ల్యాబ్‌ల మరమ్మతు, పరికరాలు, రసాయనాల కొనుగోలు, ఫర్నిచర్ సమకూర్చనున్నారు.

### సీసీ కెమెరాలకు రూ.12 వేలు

ప్రాక్టికల్ పరీక్షలు జరిగే గదుల్లో గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా అవి అరకొరగానే ఉన్నాయి. ప్రస్తుతం సీసీకెమెరాల ఏర్పాటు కోసం ప్రభుత్వం ఒక్కో కళాశాలకు రూ.12 వేల చొప్పున జిల్లాలో 16 కళాశాలలకు రూ.1.92 లక్షలను మంజూరు చేసింది., ప్రిన్సిపల్ ఖాతాల్లో జమ చేసింది. నాలుగు గదుల్లో కెమెరాలను బిగించాలని నిర్దేశించింది. ఇకపై ప్రాక్టికల్ పరీక్షలను సీసీకెమెరాల ద్వారా నేరుగా ఇంటర్‌బోర్డు కార్యదర్శి పర్యవేక్షించనున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రాక్టికల్స్ పరీక్షలపై పారదర్శకత పెరుగుతుందని మెదక్ జిల్లా ఇన్‌చార్జి ఇంటర్మీడియట్ నోడల్ అధికారి మాధవి పేర్కొన్నారు.

---

## ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు

- డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే జైలుకే..
- మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు
- డిసెంబరు 31న డీజేలు, సౌండ్ బాక్సులు నిషేధం : ఎస్పీ



సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజలకు ఇబ్బంది కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ ఒక ప్రకటనలో సూచించారు. డిసెంబరు 31న వేడుకలకు సంబంధించి, ఎలాంటి మద్యం అక్రమ రవాణా జరగకుండా ఇప్పటికే వాహనాల తనిఖీలు ప్రారంభించామని, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేస్తామని చెప్పారు. నూతన సంవత్సర వేడుకలకు, పార్టీలకు, డీజేలకు అనుమతులు లేవని, పెద్దశబ్దాలతో డీజేలు ఏర్పాటుచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులు, కుటుంబ సభ్యులపై తీసుకుంటామని స్పష్టం చేశారు. తగిన జాగ్రత్తలతో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. పోలీసుల సూచనలు ఉల్లంఘిస్తే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్‌రూమ్ నంబర్ 8712656739కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

---

వేర్వేరు ప్రమాదాల్లో
## ఎనిమిది మంది మృతి

- ములుగు మండలంలో రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం
- ఏడుపాయలకు వెళ్లి వస్తూ కారు బోల్తా పడి అప్పాజీపల్లిలో మహిళ మృతి
- ధర్మారంలో చెరువులో పడి యువకుడు..
- బంధువుల ఇంట్లో కాలుజారి పడి లక్ష్మాపూర్‌కు చెందిన వ్యక్తి..
- రామక్కపేటలో బావిలో పడి రైతు..
- శివ్వంపేటలో మూర్ఛతో చెట్టు పైనుంచి పడి ఒకరు..

7

---

# బ్యాంకు దోపిడీకి యత్నం

● దిగ్వాల్ ఎస్‌బీఐ బ్యాంక్ డోర్ జాలి, తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగుడు
● అలారం మోగడంతో బయటి నుంచి డోరు పెట్టి .. పోలీసులకు సమాచారం ఇచ్చిన గురుకుల పాఠశాల వాచ్‌మన్


బ్యాంకు డోర్ గ్రిల్‌ను తీసి, డోర్ తాళం పగులగొట్టిన దుండగుడు

కోహీర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దుండగుడు బ్యాంక్ దోపిడీకి యత్నించిన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. కోహీర్ ఎస్‌ఐ గోపతి సతీష్, గురుకుల పాఠశాల వాచ్‌మన్ అశోక్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో దిగ్వాల్ గ్రామంలోని 65వ జాతీయ రహదారి పక్కనే, మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల అద్దె భవనంలోని కింది భాగంలో ఉన్న ఎస్‌బీఐలోకి ఓ వ్యక్తి ముసుకు వేసుకుని వచ్చాడు. తన వెంట తెచ్చుకున్న గడ్డపారతో బ్యాంకు డోరు జాలిని, తాళాన్ని పగులగొట్టాడు. బ్యాంకు లోపలికి వెళ్లి డోరును మూసివేశాడు. దుండగుడు మేనేజర్ చాంబర్‌లోకి వెళ్లి అందులో ఉన్న సీసీ కెమెరాల కేబుల్ వైర్లను తొలగించాడు. వైర్లు తొలగించడంతో బ్యాంక్‌లో ఉన్న అలారం మోగింది. దీంతో బ్యాంక్‌లో ఏదో జరుగుతుందని ముందే అనుమానంతో ఉన్న గురుకుల పాఠశాల వాచ్‌మన్ హాస్టల్ నుంచి బయటికి వచ్చి బ్యాంక్ మెట్ల మీద నుంచి పైకి వెళ్లి చూశాడు. దుండగుడు లోపల ఉన్నాడని నిర్ధారించుకుని.. ఎస్‌బీఐ డోరును బయట నుంచి గడి వేసేశాడు. అనంతరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, పోలీసులకు సమాచారాన్ని అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు లోపల ఉన్న దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దుండగుడిని విచారిస్తున్నట్లు కోహీర్ ఎస్‌ఐ సతీష్ పేర్కొన్నారు.

# ఉత్తర్‌పల్లి శివారులో యువకుడి దారుణహత్య

● గొంతు కోసి చంపిన దుండగులు

కంది, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన కంది మండల పరిధిలోని ఉత్తర్‌పల్లి శివారులో చోటుచేసుకున్నది. గ్రామ శివారులోని ఓ ప్రైవేటు సంస్థ గోదాము ఎదురుగా గొంతు కోసి చనిపోయి ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, రూరల్ సీఐ క్రాంతికుమార్, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు.


మందాపూర్ రాజు మృతదేహం

మృతదేహానికి పంచనామా జరిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆ యువకుడు సంగారెడ్డి ఎల్‌ఐజీ కాలనీలో నివాసం ఉండే మందాపూర్ రాజు (34)గా గుర్తించారు. రాజుకు భార్య సుమలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజు కొండాపూర్ మండలంలోని మల్లెపల్లి పరిధిలోని ఓ పరిశ్రమ క్యాంటీన్‌లో పనిచేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. హత్యకు గల కారణాలపై క్లూస్ టీం వివరాలు సేకరించడం మొదలుపెట్టారు. ప్రత్యేక పోలీసుల బృందాలతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**గతంలో భార్య, పిల్లలతో పరారీ.. చీటింగ్ కేసులో రిమాండ్**

తూప్రాన్, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు చీటీల వ్యాపారం, అధిక వడ్డీ ఆశ చూపి చేసిన అప్పులు ప్రాణాల మీదకు వచ్చాయి. పోలీసులకు లొంగిపోయి అరెస్టయి రిమాండ్‌కు వెళ్లిరాగా.. అప్పుల వేధింపులు పెరిగిపోవడంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. తూప్రాన్ పట్టణానికి చెందిన బిజిలిపురం యాదగిరి(38) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తు జీవిస్తున్నాడు. దీంతో పాటు ప్రైవేటు చిట్టీలు నిర్వహించాడు. ప్రైవేటు చిట్టీల నిర్వహణతోపాటు, అధిక వడ్డీలకు అప్పు తీసుకున్నాడు. రూ.10 (120శాతం) వరకు వడ్డీ ఆశ చూపడంతో పెద్ద ఎత్తున అప్పు తీసుకున్నాడు. అప్పులు ఇచ్చేందుకు కొందరు ఏజెంట్లుగా పని చేసి కమీషన్లు కూడా తీసుకోవడంతో కొద్దిరోజులు సాఫీగానే సాగిపోయింది. వడ్డీలు, అప్పుల చెల్లింపులు భారం కావడంతో మార్చి 4న పెద్దగుట్టకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి భార్య, పిల్లలతో వెళ్లి అదృశ్యయ్యాడు. యాదగిరి అదృశ్యమైనట్లు కుటుంబీకుల ఫిర్యాదుతో మార్చి 5న తూప్రాన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. యాదగిరి మిస్సయినట్లు తెలియగానే అప్పులిచ్చిన బాధితులు పెద్దఎత్తున తూప్రాన్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. సుమారు రూ.10 కోట్ల వరకు అప్పులిచ్చినట్లు బాధితులు చెప్పుకొచ్చారు. బాధితుల ఫిర్యాదుతో యాదగిరిపై మార్చి 6న చీటింగ్ కేసు నమోదు చేశారు. 8న యాదగిరి పోలీసులకు లొంగిపోగా, విచారణ చేపట్టిన పోలీసులు 15న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై వచ్చిన యాదిగిరిని అప్పులిచ్చినోళ్లు రోజు వేధిస్తున్నట్లు తెలిసింది. బాధితుల వేధింపులతో సోమవారం కొందరికి డబ్బు ఇస్తానంటు హామీ ఇచ్చినప్పటికీ సమకూరలేదు. దాంతో అప్పులోళ్ల బాధ నుంచి తప్పించుకోడానికి తూప్రాన్‌లో అద్దెకు ఉంటున్న సోదరి ఇంటికి వెళ్లాడు. సోదరి ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఉరేసుకున్నాడు. కొంత సమయానికి గుర్తించిన కుటుంబీకులు కిందకు దించి తూప్రాన్ ఆస్పత్రికి తరలించగా, మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


యాదిగిరి మృతదేహం

### మనస్తాపంతో ఒకరి బలవన్మరణం

రామాయంపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామాయంపేట మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ర్యాకం దుర్గయ్య(58) భార్య గతేడాది అనారోగ్యంతో చనిపోయింది. తన భార్య కోసం చేసిన అప్పులు తీర్చలేక, ఒంటరి జీవితం భరించలేని స్థితిలో మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి తన దోతితో ఉరేసుకున్నాడు. అలాగే ధర్మారం గ్రామానికి చెందిన శ్రీకాంత్(20) మూడు రోజుల క్రితం విషం గుళికలు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా ఆస్పత్రికి తరలించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం శ్రీకాంత్ మృతిచెందాడని కుటుంబసభ్యులు తెలిపారు.



ప్రధాన రోడ్డు పక్కనే

# గ్యాస్ పరిశ్రమ వద్దు

● మద్రి గ్రామస్థుల నిరసన దీక్ష

కోహీర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన రహదారి పక్కనే గ్యాస్ పరిశ్రమను ఏర్పాటు చేయొద్దంటూ కోహీర్ మండల పరిధిలోని మద్రి గ్రామస్థులు సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. మద్రి గ్రామం నుంచి వెళ్తే 65వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారి పక్కన ఓ గ్యాస్ పరిశ్రమను ఏర్పాటుకు పనులు చేస్తుండగా, అక్కడే టెంటు ఏర్పాటు చేసుకుని గ్రామస్థులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మద్రి గ్రామస్థులు మాట్లాడుతూ తమ పొలాల మధ్యన గ్యాస్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఆటంకం కలుగుతుందని, ప్రధాన రహదారి పక్కనే గ్యాస్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రజలు భయాందోళనకు గురవుతారని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ గ్యాస్ పరిశ్రమ ఏర్పాటు చేయరాదని డిమాండ్ చేశారు. 2022 సెప్టెంబర్ 20వ తేదీన అప్పటి గ్రామ సర్పంచు, వార్డు సభ్యులు, గ్రామస్థులు అందరూ కలిసి ఇక్కడ పరిశ్రమ వద్దని ఆర్డీవో సమక్షంలోనే గ్రామ పంచాయతీ తరఫున ఏకగ్రీవ తీర్మానం చేశామని గుర్తుచేశారు. లిఖితపూర్వకంగా ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ తిరిగి పనులు ప్రారంభించడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.


గ్యాస్ పరిశ్రమ వద్ద దీక్ష చేస్తున్న మద్రి గ్రామస్థులు



# అక్రమంగా తీసుకువస్తున్న మద్యం పట్టివేత

● కారు సీజ్, నలుగురి అరెస్ట్


మద్యాన్ని సీజ్ చేసి నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

జహీరాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి అక్రమంగా తీసుకువస్తున్న గోవా మద్యాన్ని సోమవారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన వాహనాల తనఖీల్లో పట్టుబడిందని పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. సరిహద్దు చెక్ పోస్టు వద్ద నిర్వహించిన వాహనాల తనఖీల్లో జగిత్యాలకు చెందిన క్రిష్ణ, రాము, మారుతీ, అజయ్ కలిసి కారులో గోవా నుంచి జహీరాబాద్ చెక్ పోస్టు మీదుగా వెళుతుండగా తనిఖీ చేశారు. కారులో రూ.1.60 లక్షలు విలువ చేసే 48 బాటిళ్ల మద్యాన్ని తరలిస్తుండడంతో స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్‌చేసి, నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిషేదిత మద్యాన్ని సరిహద్దులు దాటి రాష్ట్రానికి తీసుకువస్తే ఊరుకునే ప్రసక్తేలేదని ఎక్సైజ్ పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, డీటీఎఫ్ సిబ్బంది, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

# మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ

● రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ప్రజల జీవితాల్లో మార్పు లేదు
● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య


మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాజకీయంగా లబ్ధి పొందేందుకు మత విద్వేషాలను రెచ్చగొడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను విస్మరిస్తూ పెట్టుబడిదారులకు లబ్ధి చేస్తున్నదని అన్నారు. కార్మిక వర్గానికి నష్టం కలిగించే చట్టాలను తీసుకువచ్చిందని విమర్శించారు. తెలంగాణలో ప్రభుత్వం మారినా ప్రజల జీవితాల్లో మార్పు రాలేదని, అధికారం కోసం కొట్లుకోవడం, తిట్లుకోవడం తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ధర్నాలు, ర్యాలీలను నిషేధిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులతో నోరు నొక్కేస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో మతోన్మాదులను అడుగుపెట్టనివ్వకుండా సీపీఎం బలపడాల్సిన అవసరం ఉన్నదని, సంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్ర మహాసభల ద్వారా ప్రజల్లో మార్పు తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో సీపీఎం ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు ముందుకు సాగుతామని వీరయ్య వెల్లడించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు మాట్లాడుతూ సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలు జనవరి 25వ తేదీ నుంచి 28 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం పార్టీ మహాసభలకు వివిధ పరిశ్రమల్లోని కార్మికులు, ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారని తెలిపారు. ఈ మహాసభలకు జాతీయ, రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని, ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లికార్జున్, జిల్లా కార్యదర్శి జయరాజ్, మాణిక్యం, నర్సింలు, కృష్ణ, దత్తు పాల్గొన్నారు.

# ప్రసాదాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి

జగదేవ్‌పూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద వేలంపాటలో దక్కించుకున్న టెండర్‌దారులు ప్రసాదాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి సూచించారు. సోమవారం జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ ఆలయం వద్ద దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటను నిర్వహించారు. పది రోజుల క్రితం అధికారులు కొబ్బరికాయలు, ఓడిబియ్యం, దుకాణ సముదాయంలకు కొబ్బరిముక్కలు, పూజా సామగ్రిలకు బహిరంగ వేలం నిర్వహించగా, లడ్డు, పులిహోర, రెండు షెట్టర్‌లకు టెండర్లతో పాటు, ఆలయం ఎదుట పూలదండలు, ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాల అలంకరణ, కిరాణం సప్లైకి సంబంధించి సోమవారం అధికారులు టెండర్లను పూర్తిచేశారు.

# 2024 యాదిలో..



2024 రౌండప్ ఆత్మావలోకనం

5వ పేజీ తరువాయి..

రైతుల ముంగిటకు ఏకంగా ఉప రాష్ట్రపతే దిగివచ్చారు. మెతుకుసీమకు తలమానికంగా ఉన్న ఐఐటీ హైదరాబాద్ ప్రయోగాలకు చిరునామాగా మారింది. ఫార్మా ఇండస్ట్రీల ఏర్పాటుపై రైతులు భగ్గుమన్నారు. అదే విధంగా మెదక్ చర్చి నూరేళ్ల సంబరాలు హైలెట్‌గా నిలిచాయి. మొత్తంగా ఎన్నెన్నో అనుభూతులను మిగుల్చుతూ 2024 సంవత్సరం వీడ్కోలు పలుకుతోంది.

## గులాబీ పార్టీకి ఎదురుగాలి

ఈ ఏడాది మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల వైపు ఎదురుగాలి వీచింది. 20 ఏళ్లుగా మెదక్ లోక్‌సభ స్థానంలో తిరుగులేని ఆధిపత్యాన్ని కనబర్చిన బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ తాకింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు విజయం సాధించగా.. రెండోస్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నిలిచారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డి మూడోస్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ స్థానం విషయంలో అందరి అంచనాలు తలకిందులయ్యాయి. ఇక జహీరాబాద్‌లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మూడోస్థానంలోనే నిలిచారు. సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్‌కు రెండోస్థానం దక్కగా కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపొందారు. బీజేపీ, కాంగ్రెస్ చెరోస్థానంతోపాటు ఓట్ల శాతాన్ని పొందాయి.



లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సిద్దిపేట సభలో పాల్గొన్న అమిత్‌షా

## అగ్రనేతలూ చుట్టేశారు

లోక్‌సభ ఎన్నికల ప్రచారంతోపాటు ఇతర సందర్భాల్లోనూ జాతీయ, రాష్ట్రస్థాయి అగ్రనేతలు ఉమ్మడి జిల్లాను చుట్టుముట్టి పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లా అల్లాదుర్గంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ సభను నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మరో సందర్భంలో పటాన్‌చెరుకు వచ్చారు. ఒక్క ఏడాదిలోనే రెండుసార్లు ప్రధాని ఉమ్మడి మెదక్ జిల్లాలో పర్యటించారు. ఇక నర్సాపూర్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరయ్యారు. సిద్దిపేటలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌కు మద్దతుగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభలో పాల్గొనగా పలువురు జాతీయస్థాయి అగ్రనేతలు పలుచోట్ల ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి పటాన్‌చెరు, నారాయణఖేడ్, మెదక్, సిద్దిపేటలో, బీఆర్ఎస్ అభ్యర్థుల కోసం మాజీ సీఎం కేసీఆర్ సిద్దిపేట, గజ్వేల్, పటాన్‌చెరు, సంగారెడ్డి, మెదక్‌లో రోడ్‌షో నిర్వహించారు. కాగా డిసెంబరు 25న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏడుపాయల వనదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఆలయానికి విచ్చేసిన తొలి సీఎంగా గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొండగట్టుకు వెళుతూ సిద్దిపేటలో ఆగారు. తన అభిమానులతో కాసేపు మాట్లాడి అభివాదం తెలిపారు.

## డ్రైవర్ లేకుండానే వాహనం

సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ ప్రయోగాలకు చిరునామాగా మారింది. సాంకేతికతను అందిపుచ్చుకుని ఐఐటీయన్లు ఎన్నో అద్భుతాలు సృష్టించారు. ప్రధానంగా డ్రైవర్ రహిత వాహనం అబ్బురపరిచింది. సెన్సార్ విధానంతో డ్రైవర్ లేకుండానే వెళ్లే వాహనాలను రూపొందించారు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, రక్షణ వ్యవస్థలకు సంబంధించి ఆవిష్కరించిన అనేక ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. కేంద్ర మంత్రులతోపాటు రాష్ట్ర మంత్రులు, విదేశీ ప్రతినిధులు ఐఐటీహెచ్‌ను సందర్శించారు.

## ఎమ్మెల్యే 'గూడెం' జంప్

బీఆర్ఎస్ పార్టీ నుంచి మూడుసార్లు పటాన్‌చెరు ఎమ్మెల్యేగా గెలిచిన గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న వ్యాపారాలపై ఆకస్మిక దాడుల నేపథ్యం వల్లనే పార్టీ మారినట్లుగా చర్చ జరిగింది. దీంతో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బలం ఆరుగురికి పడిపోయింది. గూడెం చేరికతో పటాన్‌చెరు నియోజకవర్గంలోని కాంగ్రెస్‌లో గ్రూపుల సంఖ్య పెరిగింది.

## పదవులన్నీ సంగారెడ్డి జిల్లాకే

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పెద్ద సంఖ్యలో కార్పొరేషన్ చైర్మన్ పదవులను భర్తీచేసింది. ఇందులో సిద్దిపేట, మెదక్ జిల్లాల నేతలకు నిరాశ కలిగింది. సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన నిర్మలా జగ్గారెడ్డికి టీజీఐఐసీ చైర్‌పర్సన్, పటాన్‌చెరుకు చెందిన ఫయీమ్‌కు ఫుడ్ కార్పొరేషన్, జహీరాబాద్ వాసి గిరిధర్‌రెడ్డికి సెట్విన్ సంస్థ చైర్మన్లుగా ప్రకటించారు. ఏడాది గడిచినా పదవులు దక్కకపోవడంపై సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోని సీనియర్లు అసంతృప్తితో ఉన్నారు.

## ప్రఖ్యాత చర్చి నూరేళ్ల సంబురం

ఆసియా ఖండంలోని ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి శతాబ్ది వేడుకలు అట్టహాసంగా జరిగాయి. 1924వ సంవత్సరంలో ఈ చర్చి నిర్మాణం పూర్తయ్యింది. వందేళ్ల గడిచిన సందర్భంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరయ్యారు. చర్చిని నిర్మించిన పాస్నెట్ వారసుల అనుభవాలను మాజీ మంత్రి హరీశ్‌రావు అడిగి తెలుసుకున్నారు.

## కొండపాకకు సునీల్ గవాస్కర్



సిద్దిపేట జిల్లా కొండపాకలో నిర్వహిస్తున్న సత్యసాయి చిన్నారుల గుండె చికిత్స పరిశోధన కేంద్రాన్ని ఈ ఏడాది నవంబరు నెలలో ఇండియన్ లెజెండ్ క్రికెటర్, అంతర్జాతీయ కామెంటేటర్ సునీల్ గవాస్కర్ సందర్శించారు. సత్యసాయి ట్రస్టులో సభ్యుడిగా ఉన్న ఆయన కొండపాకలో ఒక రోజంతా ఉన్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు. ఆసుపత్రిలో ఎదుట ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## దుబ్బాక ఘటనతో దుమారం

దుబ్బాక పట్టణంలో జరిగిన ఓ ఘటన రాష్ట్ర రాజకీయాలతోపాటు చిత్రపరిశ్రమలో దుమారం రేపింది. ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ సెప్టెంబరులో దుబ్బాక పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఎంపీ రఘునందన్ రావు నూలుపోగుల దండను సురేఖ మెడలో వేశారు. దీనిని వక్రీకరిస్తూ సోషల్ మీడియాలో చేసిన పోస్టుపై సురేఖ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. దీని వెనుక మంత్రి కేటీఆర్ ఉన్నారని, ఆయనతో పాటు సినీనటులు నాగార్జున, సమంతపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో చిత్రపరిశ్రమతోపాటు ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఈ వివాదం ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది.

## తిరగబడిన రైతులు




లగచర్ల రైతు హీర్యానాయక్‌కు సంకెళ్లు

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ఫార్మా పరిశ్రమను ఏర్పాటు చేయవద్దని డప్పూర్ గ్రామంలో రైతులు అక్టోబరు 5న రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. వీరికి మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మద్దతు ప్రకటించారు. హరీశ్‌రావు స్వయంగా వారి పంట భూముల వద్దకు వెళ్లి రైతులకు భరోసా కల్పించారు. ఫార్మావిలేజ్ ఏర్పాటు తాత్కాలికంగా నిలిచిపోయింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్‌పై దాడి చేశారనే నెపంతో రైతులను సంగారెడ్డి సెంట్రల్ జైలులో రిమాండ్ చేశారు. కాగా హీర్యానాయక్ అనే రైతుకు సంకెళ్లు వేసి ఆసుపత్రిలో చికిత్స కోసం తీసుకువచ్చిన ఘటన చర్చనీయాంశమైంది. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసి విచారణకు ఆదేశించారు. జైలర్‌తోపాటు జైలు సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకున్నారు. 17 మంది లగచర్ల రైతులను ఈనెల 21న బెయిల్‌పై విడుదల చేశారు.



ఫార్మా పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిర్వహించిన రైతుల రచ్చబండలో మాజీ మంత్రి హరీశ్‌రావు

## విషాదాలు.. వివాదాలు



ఓఆర్ఆర్‌పై ప్రమాదంలో చనిపోయిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత

- కంటోన్మెంట్ నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య నందిత పటాన్‌చెరు సమీపంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.
- ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు గ్రామాల్లో ఇటీవల భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.
- చిన్నకోడూరు మండలం రామునిపట్లకు చెందిన నరేష్ అనే ఏఆర్ కానిస్టేబుల్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారి లక్షల రూపాయలు అప్పు చేశాడు. చివరకు తన ఇద్దరు పిల్లలు, భార్యను తుపాకీతో కాల్చి తానూ కాల్చుకొని చనిపోయాడు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతోపాటు అప్పులపాలవుతున్న ఆన్‌లైన్ గేమ్స్ బాధితుల గోసకు అద్దం పట్టింది.
- ప్రస్తుతం దుబ్బాక నియోజకవర్గంగా మారిన నాటి దొమ్మాట మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి నవంబరు 24న మరణించారు. ఆయన 1985 నుండి 89వరకు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు.
- సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని కేసీఆర్, హరీశ్‌రావుల ఫ్లెక్సీని కాంగ్రెస్ కార్యకర్తలు తొలగించిన ఘటన వివాదంగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల నడుమ ఘర్షణ నెలకొంది.
- ములుగు మండలంలోని కోకాకోలా ఫ్యాక్టరీ ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమయంలో గజ్వేల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డి, మరో నేత బండారు శ్రీకాంత్‌రావు వర్గాలు ఘర్షణకు దిగడంతో సీఎం పర్యటన రసాభాసగా మారింది.

## హైడ్రా ప్రకంపనలు..



పటేల్‌గూడలో హైడ్రా బృందం కూల్చివేసిన ఇళ్లు

చెరువులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా కూల్చివేయడం ప్రకంపనలు సృష్టించింది. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం, సంగారెడ్డి మండలాల్లో పలు అక్రమ నిర్మాణాలను హైడ్రా, రెవెన్యూ బృందాలు కూల్చివేశాయి. ఏళ్ల తరబడిగా నిర్మించిన ఇండ్లు, విల్లాలను నేలమట్టం చేశాయి. కొండాపూర్‌లోని మల్కాపూర్ చెరువు సమీపంలో నిర్మించిన భారీ కట్టడాన్ని బాంబులతో పేల్చివేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ పలుదఫాలుగా అమీన్‌పూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో పర్యటించారు.

## రైతుల ముంగిట ఉపరాష్ట్రపతి

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని తునికిలో గల కృషి విజ్ఞానకేంద్రానికి ఈనెల 25వ తేదీన భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌తోపాటు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వచ్చారు. మెతుకుసీమలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న 650 మంది రైతులతో ముఖాముఖీ మాట్లాడారు. రైతుల శ్రమను ప్రశంసించారు. రైతులను తన ఇంటికి అతిథులుగా పిలుస్తానని, ఢిల్లీలో మూడు రోజులు వారితో ఉంటానని ఉపరాష్ట్రపతి చెప్పడం విశేషం. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు.



# మార్మోగిన రుద్రనామస్మరణ

5వ పేజీ తరువాయి..

అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యుత్ దీపాల కాంతులు, డీజే సౌండ్ నడుమ జై మల్లన్నా... అని బండారి చల్లుకుంటూ వందలాది మంది భక్తుల జయజయధ్వానాల నడుమ రథయాత్ర కన్నులపండువగా జరిపారు.

### బుకింగ్ ఆదాయం రూ.16.50లక్షలు

మల్లన్న కల్యాణం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్న క్రమంలో సుమారు రూ.16.50లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. తలనీలాల సమర్పణ, ఆర్జితసేవలు, పట్నాలు, బోనాలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె, ప్రసాద విక్రయాలు, ఇతరాల ద్వారా ఆదివారం రూ.13.40లక్షలు, సోమవారం సుమారు రూ.లక్ష బుకింగ్ ఆదాయం సమకూరిందని తెలిపారు.

### ఫలించిన పోలీసుల వ్యూహం

కల్యాణం సందర్భంగా గతంలో తోటబావి ప్రాంగణంలోని వేదిక వద్ద చివరిక్షణంలో పోలీసులు చేతులెత్తేయడంతో తోపులాట నెలకొని భక్తులు ఉక్కిరిబిక్కిరికి గురయ్యేవారు. గ్యాలరీలలో నుంచి వేదికపైకి చేరుకోవాలన్న ఆత్రుతతో భక్తులు, వీఐపీలతో పాటు బయటకు వెళ్లేమార్గం గుండా ఎదురుగా తరలిరావడంతో సమన్వయ లోపంతో అదుపు చేయడంలో విఫలమయ్యేవారు. కానీ ఈ ఏడాది కలెక్టర్ మనుచౌదరి, సిద్దిపేట సీపీ అనురాధ సూచనానుసారం చేర్యాల సీఐ ఎల్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. వన్ ఎంట్రెన్స్, వన్ ఎగ్జిట్ ఏర్పాటు చేయడంతో పాటు వీఐపీల దర్శనం, ఇతరత్రా విషయాలలో కట్టుదిట్టచర్యలు తీసుకోవడంతో పోలీసుల వ్యూహం ఫలించినట్లయింది.



ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

# విద్యాధరిలో వైభవంగా మూలమహోత్సవం

వర్గల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో విద్యాసరస్వతీ అమ్మవారికి వేదమంత్రోచ్చారణల మధ్యన విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. లక్ష పుష్పార్చనతో పాటు యాగశాలలో చండీహోమం చేశారు. వేడకలను తిలకించడానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆలయ సముదాయం ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.



వర్గల్ విద్యాధరి క్షేత్రంలో లక్ష పుష్పార్చన చేస్తున్న భక్తులు

### కేతకీలో కిటకిట

ఝరాసంగం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ ఈవో శివరుద్రప్ప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు ఉన్నారు.

### ముత్తాయికోట శివాలయంలో..

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అమావాస్యను పురస్కరించుకొని మండల పరిధిలోని ముత్తాయికోట శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక పూజలలో పాల్గొన్నారు. అర్చకుడు గోవింద్ మహారాజ్ ఆధ్వర్యంలో మహిళలతో కలష పూజ, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య హోమం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 35 ఏళ్లకే గుండెపోటు యువకుడి మృతి



కమ్మరి సుదర్శన్(ఫైల్)

నారాయణఖేడ్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): 35 ఏళ్ల యువకుడు గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన కమ్మరి సుదర్శన్ సుదర్శన్ మధ్యాహ్నం 1 గంట సమయంలో స్నేహితుల వద్దకు వెళ్లి ఇంటికి వచ్చి కూర్చున్న కొద్దిసేపటికే గుండెపోటు రావడంతో పడిపోయాడు. అక్కడికక్కడే చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుదర్శన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

# కూలి పనికి వెళ్లిన మహిళ అదృశ్యం



కేతావత్ మణి(ఫైల్)

కౌడిపల్లి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 30 : కూలి పని కోసం వెళ్లిన మహిళ అదృశ్యమైంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని శేరి తండాకు చెందిన కేతావత్ మణి జిల్లాలోని గుమ్మడిదలకు కూలి పనికి వెళ్లేందుకు ఆమె భర్త రాజు బైక్‌పై కౌడిపల్లి బస్సు స్టాప్ వద్ద ఈ నెల 28వ తేదిన ఉదయం 8 గంటల ప్రాంతంలో దింపారు. పని కోసం వెళ్లిన మహిళ తిరిగి రాకపోవడంతో 29న రాజు గుమ్మడిదలకు వెళ్లి వెతికి ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేశారు. కూలీల అడ్డా, కల్లు దుకాణం, బస్టాండ్ సమీపంలో కనిపించిందని అక్కడి వారు తెలిపారు. ఇదే క్రమంలో.. గుమ్మడదల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీసీ కెమెరాలతో వెతికినా కనిపించలేదు. భర్త రాజు కౌడిపల్లి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కొండాపూర్ పంచాయతీ కార్మికుడి అదృశ్యం

రేగోడు డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్మికుడు అదృశ్యమైనట్లు పోలీసులు సోమవారం తెలిపారు. రేగోడు ఏఎస్ఐ మల్లయ్య కథనం ప్రకారం.. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన హరిజన్ నాగయ్య(45) కొండాపూర్ పంచాయతీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. లేత ఆకుపచ్చ రంగు షర్టు, నీలి తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నాడని, ఎత్తు 5.5 ఫీట్లు కలిగి నలుపు రంగులో ఉంటాడని తెలిపారు. కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

- ములుగు మండలంలో రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం
- ఏడుపాయలకు వెళ్లి వస్తూ కారు బోల్తా పడి అప్పాజీపల్లిలో మహిళ మృతి
- ధర్మారంలో చెరువులో పడి యువకుడు..
- బంధువుల ఇంట్లో కాలుజారి పడి లక్ష్మాపూర్‌కు చెందిన వ్యక్తి..
- రామక్కపేటలో బావిలో పడి రైతు
- శివ్వంపేటలో మూర్చతో చెట్టుపై నుంచి పడి ఒకరు మృతి

ములుగు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ములుగు మండల పరిధిలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌జిల్లా మనోహరాబాద్ మండలం కోనాయపల్లి గ్రామానికి చెందిన చెట్టి పృథ్వీరాజ్(29) ఆదివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో మండలంలోని కొత్తూరు గ్రామానికి స్నేహితులను కలవడానికి బైక్‌పై వచ్చాడు. రాత్రి తిరిగి వెళ్తున్న క్రమంలో బండతిమ్మాపూర్ నుంచి దండుగూడెం కొండాపూర్ వచ్చే దారిలో రాత్రి 11 గంటలకు చోటుచేసుకున్న ప్రమాదంలో పృథ్వీరాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఘటనలో.. బీహార్ రాష్ట్రం పూర్ణియా జిల్లా తన కేనగర్‌కు చెందిన సిపుచరణ్‌కుమార్(22), అల్మానగర్ మాదేపుర చాహాఆలమ్‌నగర్‌కు చెందిన సిల్పుకుమార్(28), ఐదేళ్లుగా కొత్తూరు గ్రామంలో న్యూజివీడు కంపెనీలో పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం సమీప గ్రామంలోని కొత్తూరులోకి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో అతివేగంగా వస్తున్న డీసీఎం వీరిద్దరు ప్రయాణిస్తున్న బైకును ఢీకొట్టగా దిల్పుర్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సిపుచణ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయి కాగా, వెంటనే మేడ్చల్‌లో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతుండగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.



పృథ్వీరాజ్ (ఫైల్)

### కారు బోల్తా పడి మహిళ



నవ్య మృతదేహం

కొల్చారం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పాజీపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన మహిళ మృతి చెందింది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని షేక్‌పేటకు చెందిన చంద్రకాంత్, భార్య నవ్య(28), కూతుళ్ల తన్విశ్రీ, సహస్ర తో కలిసి ఏడుపాయల దర్శనానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అప్పాజీపల్లి వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభానికి ఢీ కొట్టింది. దీంతో నలుగురికి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో వారిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నవ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది.

### రామాయంపేట పరిధిలో ఇద్దరు



నక్కని స్వామి(ఫైల్)

రామాయంపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రామాయంపేట మండలంలో ఒకరేమో ప్రమాదవశాత్తు చెరువులో పడి ప్రాణాలొదలగా.. కాలుజారి ఇంట్లోనే కుప్పకూలి మరొకరు చనిపోయిన ఘటన సోమవారం మండల పరిధిలోని ధర్మారం, లక్ష్మాపూర్ గ్రామాల్లో చోటుచేసుకున్నాయి. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన నక్కని స్వామి(20) బంధువుల దినకర్మకు వెళ్లి చెరువులో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు ఇనుప ఫ్రేమ్‌లో ఇరుక్కుని ఊపిరాడక ప్రాణాలు వదిలాడు. లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన పెద్ద మ్యాదరి నర్సింలు(57) కామారెడ్డి జిల్లా పెందుర్తి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి బాత్రూం వద్ద కాలు జారిపడి కుప్పకూలాడు. బంధువులు ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్ఐ బాలరాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నర్సింలు(ఫైల్)

### ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు

దుబ్బాక, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతిచెందిన సంఘటన సోమవారం దుబ్బాక మండలం రామక్కపేట గ్రామంలో చోటుచేసుకున్నది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగం(48) పొలం వద్ద ఒడ్డును చదును చేస్తుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బావిలో పడిపోయాడు. భర్త పొలం నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులతో కలిసి పొలం వద్ద వెతికినా కనిపించడంలేదు. పక్కనే ఉన్న బావిలో చూసిసరికి మృతదేహం తేలిఉంది. పోలీసులకు సమాచారం అదించగా, స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

### చెట్టుపై నుంచి పడి ఒకరు



నర్సింలు(ఫైల్)

శివ్వంపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : చెట్టు ఎక్కిన వ్యక్తికి మూర్ఛ రావడంతో కింద పడి గాయాలై మృతిచెందిన సంఘటన సోమవారం గుండ్లపల్లి శివారులో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని సీతారాం తండాకు చెందిన పద్మావతి లచ్చిరాం(40) గుండ్లపల్లి శివారులో నీలగిరి చెట్లను కొనుగోలు చేశాడు. చెట్లను కోసేందుకు చెట్టుకు తాడు కట్టాడు. కాగా చెట్లు విక్రయించిన వాళ్ల అన్నదమ్ముల మధ్య విభేదాలు రావడంతో చెట్లు అమ్మమని చెప్పడంతో లచ్చిరాం ఆదివారం చెట్టుకు కట్టిన తాడును విప్పేందుకు పక్కకు ఉన్న తుమ్మ చెట్టు పైకి ఎక్కాడు. ఈ క్రమంలో చెట్టుపైనే మూర్ఛ వచ్చి కింద పడడంతో మెడ నరాలు తెగి పరిస్థితి విషమించింది. కుటుంబీకులు తూప్రాన్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లచ్చిరాంకు భార్య జెన్ని, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్రైం కార్నర్

## రైస్‌మిల్లులో దొంగతనం



కత్తి పట్టుకుని బయటకు వస్తున్న దొంగలు, సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యాలు

కొల్చారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాంపూర్ అన్నపూర్ణ రైస్‌మిల్లులో అర్ధరాత్రి దొంగతనం జరిగింది. గ్రామం పక్కన ఉన్న మిల్లులో ఇద్దరు దొంగలు షట్టర్ లేపి దొంగతనానికి పాల్పడ్డారు. వాచ్‌మన్ నారాయణ పడుకుని ఉండగా.. అతడి ఫోన్ తీసుకున్నారు. ఆఫీస్ రూమ్ తాళం పగులగొట్టి అందులో ఉన్న రూ.40 వేలను దొంగలించారు. అయితే సీసీ ఫుటేజీలో ఇద్దరు వ్యక్తులు ముసుగులు వేసుకుని వచ్చి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించామని ఎస్‌ఐ గౌస్ తెలిపారు. రైస్‌మిల్ యజమాని మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నామని తెలిపారు.

## దాబాలో చోరీ

మాసాయిపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దాబాలో చోరీ జరిగిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. చేగుంట పోలీసుల వివరాల ప్రకారం.. ఏడు నెలల క్రితం మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు ఎదురుగా ఏర్పాటైన కునాల్ దాబాలోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు రూ.1.50 లక్షల విలువైన అల్యూమినియం పాత్రలు, ఎల్‌ఈడీ టీవీ, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, ఒక పాత కారు ఎత్తుకెళ్లిపోయారు. దాబా యజమానికి హరిశంకర్ చౌదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుండెపోటుతో బీజేపీ సీనియర్ నాయకుడు మృతి

కొల్చారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో బీజేపీ సీనియర్ నాయకుడు, విశ్రాంత ఫారెస్టు ఆఫీసర్ సంబ వెంకటేశం(68) సోమవారం ఉదయం మృతిచెందాడు. బీజేపీ కోసం అహర్నిశలు కష్టపడి పార్టీని గ్రామంలో బలోపేతం చేశారు. అందరితో కలుపుగోలుగా ఉండే వెంకటేశం మృతిపట్ల ఆయా పార్టీ రాజకీయ నాయకులు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్, మాజీ సర్పంచ్ రమేష్, రవీంద్రగౌడ్, దుర్గేష్, మాజీ ఎంపీటీసీ కొమ్ముల మాధవితో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

## క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయవాదుల పరస్పర సహకార సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సి.నర్సింగ్‌రాజ్, కోశాధికారి దామోదర్‌రెడ్డి, డైరెక్టర్ బాల్‌రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది ప్రభుదాన్యం తదితరులు పాల్గొన్నారు.

## నేడు సదరం క్యాంపు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను గుర్తించే సదరం క్యాంపును జనవరి 7న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన స్లాట్లు ఈనెల 31న కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. మీసేవలో స్లాట్ బుక్ చేసుకొని సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించే దివ్యాంగుల సదరం క్యాంపునకు హాజరుకావాలని ఆమె కోరారు.

## రైతులు ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేసుకోవద్దు

నర్సాపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని వ్యవసాయ పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ అధికారులకు సమాచారం లేకుండా రైతులు ఎలాంటి మరమ్మతులు చేపట్టొద్దని నర్సాపూర్ విద్యుత్‌శాఖ ఏడీఈ వెంకటరామ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పలుచోట్ల గ్రామాల్లో ఏదేని సమస్య వస్తే స్థానిక విద్యుత్ సిబ్బందికి లేదా అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## డీఎస్పీ తనిఖీ

శివ్వంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌ను తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి క్రైమ్ ఫైళ్లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు గురించి అడిగి తెలుసుకున్నారు. డిసెంబరు 31 నేపథ్యంలో సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## ఉద్యోగ విరమణ సహజం

వట్‌పల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మానయ్య అన్నారు. సోమవారం మేడికుంద శివారులో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో పోతులబోగుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన సత్యనారాయణ ఉద్యోగ విరమణకు ఆయన హాజరై మాట్లాడారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మెదక్ అర్బన్: ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్

# ప్రజలకు న్యాయం చేసేందుకే 'ప్రజావాణి'

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ప్రజావాణిలో 72 అర్జీలు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు న్యాయం చేసేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ అధికారుల లక్ష్యమని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. వచ్చిన అర్జీల్లో కొన్ని ముఖ్యమైనవి ఈ విధంగా ఉన్నాయి. సంగారెడ్డికి చెందిన మల్లేశ్, జనార్దన్ మరో పదిమంది వీడియోగ్రాఫర్లు తాము ఎంపీ ఎన్నికల్లో 42 రోజుల పాటు విధులు నిర్వహించినా ఇంతవరకు డబ్బులు చెల్లించలేదన్నారు. తమకు న్యాయం చేయాలని అర్జీలో కోరారు. సంగారెడ్డికి చెందిన మంగళ, నాగరాజు, మంజుల మరో 14 మంది రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులు తాము 2009లో రూ.49 వేలు కట్టినా ఇంతవరకు ఇళ్లు ఇవ్వలేదని, ఇప్పటికైనా కేటాయించాలని కోరారు. మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని తుడుం సుభాష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోహీర్ మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు సరోజమ్మ తనకు రూ.50వేల బ్యాంకులో మాఫీ కాలేదని, మాఫీ చేసి ఆదుకోవాలన్నారు. వీటితో పాటు పింఛన్, కొత్త పట్టా పాస్ బుక్కులు ఇప్పించాలని, తమ భూమికి సంబంధించి ఆన్‌లైన్ రికార్డుల్లో తమ పేరు నమోదు చేయాలని వివిధ సమస్యలపై 72 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌వో పద్మజారాణి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### 'ప్రజావాణి'కి 72 దరఖాస్తులు

మెదక్ అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 72 దరఖాస్తులు రాగా.. వాటిని అదనపు కలెక్టర్ స్వీకరించారు. ఇందులో అధికంగా ధరణి 18, ఇందిరమ్మ ఇళ్లు 18 రాగా.. పెన్షన్ 4, ఇతర సమస్యలపై 25 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీలను ఎప్పటికప్పుడు ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో భుజంగరావు, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

మెదక్ అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

## ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా: ఎమ్మెల్యే



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాణిక్‌రావు

ఝరాసంగం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో రూ.20 లక్షలతో కొనసాగుతున్న షాదీఖానా నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దీని నిర్మాణానికి అదనంగా నిధులు అవసరముంటే కేటాయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు జగదీశ్వర్, సంగమేశ్వర్, నర్సింహాగౌడ్, ఎజాజ్‌బాబా, పరమేశ్వర్‌పటేల్, వెంకట్‌రెడ్డి, బషీర్, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి



హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సాయికుమార్ ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. సోమవారం నర్సాపూర్‌లోని పెద్దమ్మకాలనీ స్వగృహంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీం, కౌన్సిలర్ సునీతాబాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యంగౌడ్, నాయకులు ఉన్నారు. అలాగే సాయికుమార్ మృతదేహానికి మెదక్ అదనపు డీఎస్పీ మహేందర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయికుమార్ కుటుంబానికి పోలీస్‌శాఖ అన్నివిధాల అండగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు లింగం, గౌస్ ఉన్నారు.

## అభివృద్ధిని ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు: కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకే మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ప్రజలను మభ్యపెట్టేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సోమవారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు రాజేష్‌చౌహాన్, నర్సింహులు, సంధ్యారాణి రామక్రిష్ణ, సవితాహన్మండ్లు, పార్టీ మండల అధ్యక్షుడు తాహేర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ముంతాజ్ మాట్లాడుతూ పదేళ్లుగా ఖేడ్ ఎమ్మెల్యేగా, నాలుగేళ్లు బీఆర్ఎస్ వారు మున్సిపల్ పాలకవర్గంగా ఉన్నా అభివృద్ధి గురించి పట్టించుకోకపోగా నిధులను దుర్వినియోగం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది, తాము మున్సిపాలిటీలో బాధ్యతలు చేపట్టి పదినెలలైనా అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టామన్నారు. ముఖ్య నాయకులు పండరిరెడ్డి, శంకర్ ముదిరాజ్, దిల్‌దార్‌ఖాన్, గౌస్‌చిస్తీ పాల్గొన్నారు.

## ధీరవనితలను ఆదర్శంగా తీసుకోవాలి: సునీతారెడ్డి



కరాటే విన్యాసాలను ప్రదర్శిస్తున్న యువతులు

మెదక్ అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేటి తరం యువతులు చదువు, ఉద్యోగాలతో పాటు దేశం, ధర్మం కోసం జీవితాలను త్యాగం చేసిన వీరమణులు, ధీరవనితల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీతారెడ్డి పేర్కొన్నారు. వీహెచ్‌పీ, మాతృశక్తి దుర్గా వాహిని మెదక్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మాతృవందన యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ.. యువతులు సున్నితత్వంతోపాటు శూరత్వం కలిగి ఉండాలన్నారు. అనంతరం పట్టణంలో వందలాది మంది దుర్గావాహిని యువతులు కాషాయ జెండాలను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ గీత, ప్రాంత దుర్గావాహిని సంయోజక పద్మశ్రీ, ప్రాంత మాతృశక్తి సంయోజకరెడ్డి, జిల్లా సంయోజకశర్మ, శారద, విమలవింధ్య పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారానికి రండి

- ఎంపీకి వీరశైవ లింగాయత్ సమాజం ఆహ్వానం



హైదరాబాద్‌లో ఎంపీ సురేశ్‌షెట్కార్‌ను కలిసిన వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి రావాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్‌కు సమాజం సభ్యులు ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని ఎంపీని కలిశారు. జనవరి 5న సంగారెడ్డిలోని జేఆర్‌ఆర్ గార్డెన్స్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు నూతన అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింహులు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో కోశాధికారి సంతోశ్‌పాటిల్, యూత్ అధ్యక్షుడు బుగ్గన్నగారి మల్లికార్జున్, నాగరాజు, నీలకంఠం, ప్రధాన కార్యదర్శి నవీన్‌రామోజీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం మల్లికార్జునుడి సేవలో ఎమ్మెల్యే

నారాయణఖేడ్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఆయన సతీమణి అనుపమ్మరెడ్డి సోమవారం బంధువులతో కలిసి శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు, ఆలయ మర్యాదలతో స్వాగతం చెప్పి, తీర్థప్రసాదాలు అందించారు. తమ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు.

## మహిళా సమాఖ్య సభ్యులు ఆర్థికంగా ఎదగాలి: డీఆర్డీవో



మాట్లాడుతున్న డీఆర్డీవో జ్యోతి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళా సమాఖ్య సభ్యులు మార్చి 2025లోపు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలని డీఆర్డీవో జ్యోతి ఆకాంక్షించారు. సంగారెడ్డిలోని జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సమాఖ్యలు పాలకవర్గ విధులను నిర్వహించుకుని శాస్త్రనాత్మక బాధ్యతలను నెరవేర్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీఆర్డీవో కోట జంగారెడ్డి, డీపీఎం, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శూన్యం అమావాస్య వేడుకలు



నారాయణఖేడ్: పొలంలో గుడిసె వేసి పూజలు చేసిన రైతులు

నారాయణఖేడ్/కల్హేర్/కంగ్టి/నాగల్‌గిద్ద/సంగారెడ్డి క్రైం/శివ్వంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ప్రాంతంలో సోమవారం శూన్యం అమావాస్య వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శూన్యం అమావాస్యను పురస్కరించుకొని గ్రామాల్లోని రైతులంతా పొలాల బాటపట్టారు. పాడి పంటలతో తమ కుటుంబాలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకుంటారు. సిర్గాపూర్, కల్హేర్ మండలాల్లో సోమవారం రైతులు శూన్యం(ఎలామాస) అమావాస్యను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అందులో భాగంగా భూమికి ప్రత్యేక పూజలు చేశారు. శూన్యం అమావాస్య వేడుకలను కంగ్టి, నాగల్‌గిద్ద మండల కేంద్రాలతోపాటు వివిధ గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. సంగారెడ్డి పట్టణం వీరభద్రనగర్ కాలనీలోని భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సోమావతి అమావాస్య సందర్భంగా ప్రధాన అర్చకులు మఠం శివస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర పాల్గొని పూజలు జరిపించారు. శివ్వంపేటలో కొలువైన శక్తిపీఠం బగలాముఖి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

## చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో గురునాథ్

రేగోడు/అల్లాదుర్గం/వెల్దుర్తి/మనోహరాబాద్/నిజాంపేట/చిన్నశంకరంపేట/టేక్మాల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించాలని ఎంఈవో గురునాథ్ తెలిపారు. తెలంగాణ సాంఘీకశాస్త్ర టీచర్స్ ఫోరమ్ మెదక్ జిల్లా ఆదేశాల మేరకు సోమవారం రేగోడు ఉన్నత పాఠశాల ఆవరణలో సోషల్ టాలెంట్ టెస్టు పరీక్షలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అల్లాదుర్గం ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సాంఘీకశాస్త్ర ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించారు. వెల్దుర్తి మండల పరిధిలోని కుకునూర్ ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్ర పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో యాదగిరి హాజరై మాట్లాడారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నిజాంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సాంగని యాదగిరి మాట్లాడారు. చిన్నశంకరంపేటలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు దీప్లారాథోడ్ ఆధ్వర్యంలో సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. చిన్నశంకరంపేట హైస్కూల్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ప్రథమ బహుమతి, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థికి ద్వితీయ, మిర్జాపల్లి జడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థికి తృతీయగా ఎంపికయ్యారు. వీరికి ఎంఈవో పుష్పవేణి బహుమతులను ప్రదానం చేసి మాట్లాడారు. టేక్మాల్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి సుజాత ప్రారంభించారు.

## కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాశామైలారం పారిశ్రామికవాడలోని హిమజల్ పరిశ్రమలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని బీఎంఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ముందస్తు సమాచారం లేకుండా పోలీసు పహారా పెట్టి భయభ్రాంతులకు గురిచేసి కార్మికులను తొలగించడం దుర్మార్గమన్నారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న 16 మంది పర్మినెంట్ కార్మికులను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకు బీఎంఎస్ తరఫున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రమబద్ధీకరించే వరకూ సమ్మె యథాతథం

- 24వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె



మెదక్ అర్బన్ : సీఎం రేవంత్‌రెడ్డి కటౌట్ చుట్టూ బతుకమ్మ ఆడుతున్న సమగ్ర శిక్షా మహిళా ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూసమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె 24వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా సమ్మె శిబిరం వద్ద ఉద్యోగులు వీ వాంట్ రెగ్యులరైజ్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించేవరకూ సమ్మె విరమించమని స్పష్టం చేశారు. మెదక్ కలెక్టరేట్ సమ్మె శిబిరం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి కటౌట్ పెట్టి ఉద్యోగులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళన

కల్హేర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని జీపీ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం కల్హేర్ ఎంపీపీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. గ్రామపంచాయతీల్లో వెట్టిచాకిరీ చేయిస్తున్న తమకు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కల్హేర్ మండలంలోని గ్రామపంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు.

## 'ఓపీఎస్‌ను పునరుద్ధరించండి'

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.నర్సింహులు కోరారు. సంగారెడ్డిలోని సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగులకు నష్టం జరుగుతున్నందున రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏలను వెంటనే ప్రకటించాలని, పీఆర్‌సీ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాహుల్, నాయకులు రవి, బస్వరాజ్, నర్సింహులు, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

## నాగులపల్లి వాసికి డాక్టరేట్



పట్టా అందుకున్న ప్రభాకర్

నర్సాపూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం నాగుపల్లికి చెందిన గడ్డం ప్రభాకర్ నల్గొండ జిల్లాలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఓ వైపు బీవీఆర్‌ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే మరోవైపు నల్గొండ విశ్వవిద్యాలయంలో సింథసిస్, బయోలాజికల్ యాక్టివిటీ అండ్ డాకింగ్ స్టడీ ఆఫ్ ఆక్సాడయోజోలిల్, పైరజైన్ పిరిడిన్ అండ్ ఆరైల్ డెరివేటివ్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు ప్రభాకర్ తెలిపాడు.

## శరీర దారుఢ్యానికి క్రీడలు అవసరం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జీ.అంజయ్య

రాయికోడ్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శరీర దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జీ.అంజయ్య అన్నారు. సోమవారం రాయికోడ్ మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో హజ్రత్ షంషేర్‌కు జాతరలో భాగంగా నిర్వహించిన కుస్తీ పోటీల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కుస్తీ పోటీలు నిర్వహించడం వల్ల గ్రామాల మధ్య సోదరభావం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్ధన్నపాటిల్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వినయ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలాజీనర్సింహులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి పాల్గొన్నారు.

## మహ్మద్ ఫరీదుద్దీన్ అందరికీ ఆదర్శప్రాయుడు

జహీరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి, దివంగత నేత మహ్మద్ ఫరీదుద్దీన్ అందరికీ ఆదర్శప్రాయుడని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో ఫరీదుద్దీన్ తనయుడు తన్వీర్ నేతృత్వంలో ఆయన నివాసంలో 3వ వర్ధంతి నిర్వహించారు. ఈ వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడుతూ ఫరీదుద్దీన్ రాష్ట్రవ్యాప్తంగా అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుని ఆదర్శప్రాయుడిగా పేరు ప్రఖ్యాతలు పొందారన్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

## ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ప్రచురణ

తూప్రాన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ, పట్టభద్రుల ఫైనల్ జాబితా ప్రచురణ చేసినట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓటరు జాబితా ఫైనల్ చేశారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో పట్టభద్రులు 2,670 మంది, ఉపాధ్యాయులు 248 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు వివరించారు.

## పఠనాసక్తి పెంపొందించడం కోసమే పద్య పఠన పోటీలు: మాధవానంద స్వామి

కొల్చారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో పఠనాసక్తి రోజురోజుకు తగ్గిపోతుందని రంగంపేట మాధవానంద సరస్వతి ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి అన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించడం కోసం మండలస్థాయిలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పద్య పఠనం, భాగవత రామాయణ, ఇతిహాసాలకు సంబంధించిన అంశాలపై పరీక్ష పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి పరీక్షల వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందడంతోపాటు హిందూ సంస్కృతీ, సంప్రదాయాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాచారం పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతీస్వామి, ప్రముఖ సంస్కృత పండితుడు దోర్బల ప్రభాకర్ శర్మ, కొల్చారం ఎంఈవో సత్యనారాయణరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రభులింగం పాల్గొన్నారు.